

యువత నృత్యాలు

వినాయకా.. సెలవిక!



- ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం
- భారీ బందోబస్తు మధ్యన ఊరేగింపు
- రాత్రి వరకు కొనసాగిన నిమజ్జన కార్యక్రమం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి, ఎస్పీ, అధికారులు



నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 11: నంద్యాల జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఐదు రోజుల పాటు పూజలందుకున్న వినాయక విగ్రహాలను బుధవారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, నందికొట్కూరు పట్టణాలతో పాటు నంద్యాల జిల్లా కేంద్రంలో వేడుకలు జరిగాయి. వాడవాడలా కొలువుదీరిన వినాయక విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఊరేగింపు నిర్వహించారు. నంద్యాల పట్టణంలో గణేశ్ కేంద్రసమితి ఆధ్వర్యంలో మొదటి వినాయక విగ్రహానికి పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. ముందుగా పరిపాలనా, రక్షణ గణపతులకు పూజలు నిర్వహించి ఉదయం 11:30 గంటలకు నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, డీఆర్వో పద్మజ, అసిస్టెంట్ కమిషనర్ అంకిరెడ్డి, చైర్‌పర్సన్ మాబున్నిసా, తహసీల్దార్ ప్రియదర్శిని, నంద్యాల డీఎస్పీ యుగంధర్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐలు మోహన్‌రెడ్డి, ఎరిషావలి, నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్త పాల్గొన్నారు. నంద్యాలలో చిన్నచెరువు, రాణిమహారాణి వద్ద గల కాలువ, బొమ్మలసత్రం వద్దగల కుందూనది, అయ్యలూరు మెట్టవద్ద గల కేసీ కెనాల్ వద్ద భక్తులు గణనాథులను నిమజ్జనం చేశారు. దాదాపు 500కు పైగా విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి.



నంద్యాలలో ఉత్సాహంగా.. వినాయక ఊరేగింపు



నంద్యాలలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



నందికొట్కూరు: ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



డోన్: నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల



బనగానపల్లె: వేషధారణలో కళాకారులు



గణపతిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



నంద్యాలలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు






శివపార్వతుల మధ్యన వినాయకుడు



అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఫరూక్



క్రేన్ ద్వారా నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు



ఏనుగుపై గణనాథుడు



కేరింతలు



మహానందిలో..

అడ్మిషన్ల గడువు పొడిగింపు

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 11: ఓపెన్ స్కూల్ ద్వారా పదో, ఇంటర్ ప్రవేశాల గడువును 15 వరకు పొడిగించినట్లు కర్నూలు డీఈవో శామ్యూల్ బుధవారం తెలిపారు. అభ్యర్థులు మీసేవా, ఆన్‌లైన్ ద్వారా చేసుకున్న దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

శ్రీశైలం గేట్ల మూసివేత

- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

శ్రీశైలం, సెప్టెంబరు 11: శ్రీశైలం జలాశయానికి బుధవారం వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో డ్యాం క్రస్టుగేట్లను అధికారులు మూసివేశారు. జలాశయం ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 1,10,719 క్యూసెక్కులు, సుకేసుల నుంచి 31,353 క్యూసెక్కులు మొత్తం 1,41,897 వరద వస్తోంది. బుధవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి జలాశయానికి 1,47,688 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.



శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.10 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 210.5133 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,094 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

నేడు నంద్యాలలో సాగునీటి ప్రాజెక్టులపై సమావేశం

నంద్యాల టౌన్, సెప్టెంబరు 11: రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, సమస్యలు, నీటి హక్కులపై గురువారం నంద్యాలలో సమావేశం నిర్వహిస్తున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి బుధవారం తెలిపారు. పట్టణంలోని చామకాల్వ దగ్గర ఉన్న రాజారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రాయలసీమ అభివృద్ధి, పౌరుల బాధ్యత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాచరణ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. రాయలసీమలోని 8 జిల్లాల నుంచి ప్రజాసంఘాల నాయకులు, ప్రముఖులు, రైతులు పాల్గొంటారని తెలిపారు.

ఉపాధి పనులను పూర్తి చేయండి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 11: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం కింద నిర్దేశించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి ఎంపీడీఓలు, ఏపీడీలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ చాంబర్‌లో ఉపాధి హామీ పథకం కింద లేబర్ బడ్జెట్, వంద రోజుల పనిదినాల కల్పన, హార్టికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్ పనులు, ట్రెంచ్ పనుల ప్రగతి లక్ష్యాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ల వారీగా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి ఉపాధి పనులను పరిశీలించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల వాగ్వాదం

పోలీసు స్టేషన్‌కు చేరిన పంచాయితీ

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 11: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద బుధవారం చేపలవేట వాగ్వాదానికి దారితీసింది. మత్స్యకారులు ఘర్షణకు పాల్పడడంతో పంచాయితీ పోలీసు స్టేషన్‌కు చేరింది. మత్స్యశాఖ అధికారులు పోతిరెడ్డిపాడు వద్ద 100 మీటర్ల వరకు చేపలు పట్టకూడదని నిషేధించారు. వారిమాటలు, పోలీసుల ఆదేశాలు లెక్కచేయకుండా ప్రమాదకర స్థలంలో చేపలు పడుతున్నారు. బుధవారం మత్స్యకారులు వర్గాలుగా విడిపోయి వాగ్వాదానికి దిగారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు మత్స్యకారులను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆ ప్రాంతంలో చేపలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చాబోలు, పోతులపాడు, తుమ్మలూరు గ్రామాలకు చెందిన వందలాది మత్స్యకారులు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ డేంజర్ జోన్ వద్ద నెలలో గ్రామాల వారిగా వంతుల ప్రకారం గుత్తి వలలు, జాలీలతో ప్రమాదకరంగా చేపలు పట్టుకుంటున్నారు. మంగళవారం చాబోలు గ్రామానికి చెందిన వంతులు ముగియడం, తుమ్మలూరు గ్రామానికి చెందిన మత్స్యకారులు ప్రారంభించిన కొద్దీ సేపటికి వారిలో వారికే పడకపోవడంతో ఈ వివాదం నెలకొంది. మత్స్యకారుల మధ్య వాగ్వాదానికి చేపల వ్యాపారులే కారణమని పలువురు చర్చించుకుంటున్నారు.



పోతిరెడ్డిపాడు వద్ద ప్రమాదకర స్థాయి నీటి ప్రవాహం వద్ద ఏర్పాటు చేసిన గుత్తి, వలలు

వరద బాధితులకు టీడీపీ చేయూత



నిత్యావసర వస్తువుల కిట్‌ను మోసుకెళ్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

● కిట్ల పంపిణీలో మంత్రి భరత్, ఎమ్మెల్యేలు ● చంద్రబాబు ఆదేశాలతో ఇంటింటికీ వెళ్లిన నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితులకు సహాయం చేసేందుకు కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ చొరవచూపింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌తో పాటు ఎమ్మెల్యేలు, కీలక నాయకులు, కార్యకర్తలు బుధవారం వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి సహాయక చర్యలను ముమ్మరంగా చేపట్టారు. సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునివ్వడంతో రూ.కోటి విలువైన నిత్యావసర సరుకులను కర్నూలు నుంచి ఆరు లారీల్లో తీసుకెళ్లి వరద ప్రాంతాల్లోని బాధితులకు స్వయంగా అందజేశారు. విజయవాడ నగరంలోని ఊర్మిలా నగర్, జోజినగర్, బాంబేనగర్, సుబ్బారావు వీధి, గొల్లపూడి, వైఎస్సార్ కాలనీల్లో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు జయనాగేశ్వర్ రెడ్డి, గౌరుచరిత, శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డిలు టీడీపీ నేతలతో కలసి వరద బాధితులకు నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలను ఆదుకోవడంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడని తెలిపారు. వరద బాధితుల కోసం రూ.కోటి విలువైన 8 వేల కిట్లను పంపిణీ చేశామన్నారు. విజయవాడలో వరదలు రావడం బాధాకరమని, ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు రాత్రి, పగలు వారికి సేవలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుత నాయకులు ఆయన అడుగు జాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు. వైసీపీ నాయకులు వరద బాధితులకు చేసిన సహాయం ఏమీ లేదన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప ఏ ఒక్క బాధితుడికి ఎలాంటి సహాయం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర నాయకులు వై.నాగేశ్వరరావు యాదవ్, ఆలూరు నేత వీరభద్రగౌడ్, నంద్యాల నాగేంద్ర, కార్పొరేటర్ పరమేష్, హనుమంతరావు చౌదరి, షేక్షావలి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కిట్‌ను మోసుకెళ్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



విజయవాడలో వరద బాధితులకు జిల్లా నాయకులతో కలిసి కిట్లు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్



సరుకులను అందజేస్తున్న టీడీపీ నేత వీరభద్ర గౌడ్



విజయవాడలోని గొల్లపూడిలో వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డివైడర్‌ను ఢీకొన్న కారు..

శిరివెళ్ల, సెప్టెంబరు 11 : కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై గోవిందపల్లె సమీపంలోని గణేష్ గోడౌన్స్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాకు చెందిన సూర్య(35) అనే వ్యక్తి మృతి చెందాడు. కడప వైపు నుంచి నంద్యాల వైపు వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి కుడివైపు డివైడర్‌ను ఢీకొట్టడంతో కారుబోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సూర్య తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందగా అందులోని గణేష్, నిత్య గాయాలపాలయ్యారు. వారిని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ విష్ణు కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య బుధవారం తెలిపార

14న సమగ్ర శిక్ష ఉద్యోగుల ప్రాంతీయ సదస్సు

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 11: కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో ఉన్న సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 14వ తేదీన సమగ్ర శిక్ష ఉద్యోగుల హక్కుల సాధన ప్రాంతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ కో చైర్మన్ మహ్మద్ రఫీ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఆర్‌పి పాలసీ రెగ్యులరైజేషన్ సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, సమ్మె కాలానికి జీతం చెల్లింపు వంటి సమస్యలను చర్చిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు, రాష్ట్ర చైర్మన్ కాంతారావు నానీ హాజరవుతున్నారని అన్నారు. ఈ నెల 14న శనివారం ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభం అవుతుందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సమగ్ర శిక్ష ప్రాజెక్టులో ఎంఈవో కార్యాలయ సిబ్బంది, భవిత సిబ్బంది, హై స్కూల్, అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో పని చేస్తున్న పార్ట్ టైమ్ టీచర్లు, కేజీబీవీ ప్రిన్సిపాల్స్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, జిల్లా ఆఫీసు స్టాఫ్, ఇంజనీరింగ్ సిబ్బంది అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా సలహాదారులు బాబు, అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షుడు మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం రూ.11 లక్షల విరాళం

● లోకేశ్‌కు కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 11: వరద బాధితులకు కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత, తెలుగుదేశం పార్టీ నాయకుడు కేవీ సుబ్బారెడ్డి రూ.11 లక్షల విరాళం అందజేశారు. బుధవారం విజయవాడలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కలిసి మంత్రి నారా లోకేశ్‌కు ఆయన చెక్కును అందజేశారు.



లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత

బొల్లవానిపల్లెలో వజ్రం లభ్యం

తుగ్గలి, సెప్టెంబరు 11: పొలం పనులు చేసుకుంటున్న వ్యవసాయ కూలికి విలువైన వజ్రం లభ్యమైంది. బుధవారం మండల పరిధిలోని బొల్లవానిపల్లెకి చెందిన వ్యవసాయ కూలీకి వజ్రం దొరకడంతో దానిని జొన్నగిరికి చెందిన వజ్రాల వ్యాపారస్థుడు రూ.2.50 లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం. తొలకరి జల్లులు కురిసిన సమయంలో ఈ ప్రాంతంలో వజ్రాలు దొరుకుతూ ఉంటాయి. తాజాగా వజ్రం లభించడంతో వ్యవసాయ కూలి ఆనందానికి అవధులేకుండా పోయాయి.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీకి నోటిఫికేషన్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 11: డిగ్రీ 2015-16,17,18 విద్యా సంవత్సరంలో చేరి కోర్సు పూర్తి చేసుకోలేని వారికి ఒక అవకాశం కల్పిస్తున్నామని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. పైన పేర్కొన్న సంవత్సరాల్లో చేరిన విద్యార్థులు ఏ సెమిస్టర్‌లో ఫెయిల్ అయిన సబ్జెక్టుకైనా దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ జారీ చేశామని పేర్కొన్నారు. నవంబర్ 5వ తేదీ లోపు ఆయా కళాశాల్లో ఫీజులు చెల్లించి, మిగిలిన వివరాల కోసం నోటిఫికేష్ పరిశీలించాలని పేర్కొన్నారు.

నాన్న మా అమ్మను కొడుతున్నాడు..

పోలీసులకు ఫిర్యాదు చేసిన 10 ఏళ్ల బాలిక

అఖిలను అభినందించిన సీఐ జయన్న

పత్తికొండ, సెప్టెంబరు 12 : బుధవారం సాయంత్రం 4:40 సమయం. పదకొండేళ్ల బాలిక అఖిల బిక్కుబిక్కుమంటూ పత్తికొండ స్టేషన్ ఆవరణలోకి వచ్చింది. సెంట్రీ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఏం కావాలమ్మా అంటూ బాలికను ప్రశ్నించాడు. మా నాన్న తాగివచ్చి అమ్మను కొడుతున్నాడు అని బాలిక చెప్పింది. సెంట్రీ బాలికను సీఐ జయన్న వద్దకు తీసుకెళ్లారు. సీఐతో కూడా బాలిక ధైర్యంగా సమస్య చెప్పింది. ఆయన స్పందించి వెంటనే కానిస్టేబుల్‌ను బాలిక వెంట వారి ఇంటికి పంపించారు. బాలిక తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. అఖిలను సీఐ అబినందించారు. కాగా బాలిక పత్తికొండ బాలికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది.



సీఐ జయన్నకు ఫిర్యాదు చేస్తున్న బాలిక అఖిల

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 11: మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన ఈడిగ రవిచంద్రపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్ రఫీ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన గంగపోగు రాజగోపాల్ ఇంటి ముందు, రవిచంద్ర తన హోటల్‌లోని వ్యర్థపు నీరు, చెత్తను వేస్తున్నాడన్నారు. ఇంటి ముందు నీరు చెత్త వేయవద్దని ప్రశ్నించినందుకు రాజగోపాల్‌ను కులం పేరుతో దూసిస్తూ, కాళ్ల, చేతులతో రవిచంద్ర తన్నినట్లు ఫిర్యాదు చేశాడన్నారు. అతడి ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసపినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చిన్నారిని దిగమింగిన పైప్ లైన్ గుంత

● అధికారులు తవ్వి వదిలేశారు
● కన్నీరు మున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు, బంధువులు



కుమారుడు గౌతమ్‌ను ఎత్తుకున్ని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు



రుద్రవరం, సెప్టెంబరు 11 : సూర్యోదయాన తల్లిదండ్రులు కూలీ పనికి వెళ్లారు. పిల్లలను ఇంటి వద్దనే జేజినాయన వెంకటేశ్వర్లు సమక్షంలో వదిలారు. పైపులైను కోసం తీసిన గుంతలో ఐదేళ్ల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి పడిపోయాడు. ఈ విషాదం బుధవారం మధ్యాహ్నం ఆ ఐదేళ్ల చిన్నారి గౌతంకు మృత్యువుగా కబళించింది. ఈ సంఘటన రుద్రవరం మండలం చందలూరు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సుబ్బయ్య, మహేశ్వరి దంపతులకు ఐదేళ్ల చిన్నారి గౌతం, మరో కుమార్తె ఉన్నారు. వీరు వ్యవసాయ కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నారు. బుధవారం ఉదయం పొలం పనులకు వెళుతూ పిల్లలను జేజినాయన వెంకటేశ్వర్లు వద్ద వదిలి వెళ్లారు. ఈ మధ్య అధికారులు పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలో బాలుడు గౌతం పడిపోయాడు. గౌతం ఎంత సేపటికి కనిపించకపోయేసరికి జేజినాన వెంకటేశ్వర్లు పైప్ లైన్ గుంతలో వెతికాడు. ఇతరుల సాయంతో బాలుడ్ని అందులోంచి బైటికి తీశాడు. అప్పటికే బాలుడు మృతి చెందాడు. తల్లిదండ్రులు సుబ్బయ్య, మహేశ్వరి హుటాహుటిన ఇంటికి వచ్చి చనిపోయిన కుమారుడ్ని చూసి విలపించారు. పొద్దున పొలం పనులకు వెళుతున్నప్పుడు కొడుకు టాటా చెప్పాడని, అంతలోనే విగత జీవి అయ్యాడని రోదించారు.

అధికారుల నిర్లక్ష్యం

సర్పంచ్ పుల్లమ్మ ఆధ్వర్యంలో ఎన్నికల ముందు అధికారులు పైపులైను కోసం గుంత తవ్వి వదిలివేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంత నిండా నీరు చేరింది. పైపులైను ఏర్పాటు చేసి పూడ్చి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని స్థానికులు వాపోయారు. కాగా తాను విధుల్లో చేరకముందే ఈ గుంత తవ్వారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లి పూడ్చిస్తామని చందలూరు పంచాయతీ కార్యదర్శి మౌనిక అన్నారు. ఇక్కడ గుంత తవ్వడానికి అనుమతి లేదని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రమోద్ అన్నారు. గ్రామ రెవెన్యూ అధికారి ఫక్రుద్దీన్ మృతదేహాన్ని పరిశీలించారు.

శ్రీమఠంలో ఆభరణాల తనిఖీ

● గత 30 ఏళ్లుగా లెక్కించనివి కూడా..
● 18 మఠాల ఆభరణాల లెక్కింపు పూర్తి

మంత్రాలయం, సెప్టెంబరు 11: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం చరిత్రలో ఎప్పుడు లెక్కించని బంగారు, వెండి ఆభరణాలను పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు లెక్కించి రికార్డు చేసేందుకు శ్రీకారం చుట్టారు. కర్నూలు జిల్లా జేవీవో పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీ ఈ పనిని పర్యవేక్షిస్తున్నారు. మంత్రాలయం ప్రధాన కేంద్రంగా మరో 35 బ్రాంచ్ మఠాల్లో బంగారం, వెండి ఆభరణాలపై లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. మంత్రాలయంతో పాటు 18 మఠాల్లో ఈ పని పూర్తి కాగా, మరో 12 మఠాలను లెక్కించాల్సి ఉందని జిల్లా దేవదాయశాఖ బంగారు, వెండి తనిఖీ అధికారి పాండురంగారెడ్డి తెలిపారు. బుధవారం మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులతో కలిసి ఇంత వరకు మఠాల్లో పర్యటించి లెక్కించిన ఆభరణాల వివరాలపై మాట్లాడారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం, సోలాపూర్, తిరుపతి, హైదరాబాదు బర్కత్‌పూర్, గద్వాల, మహబూబ్ నగర్, ముంబైలోని రెండు మఠాలు, తుంగభద్ర, కదిరి, తాడిపత్రి, ఆదోని మఠాలు పూర్తయినట్లు తెలిపారు. లెక్కించాల్సినవి గోవా, ఢిల్లీ, కొల్హాపూర్, ధర్మవరం, పెనుగొండ, హైదరాబాద్ మల్కాజ్‌గిరి, ఉరవకొండ, రాయచోటి వంటి మఠం బ్రాంచులను తనిఖీ చేయాల్సి ఉందన్నారు. పాండురంగారెడ్డికి పీఠాధిపతి శేషవస్త్రం, ఫల పుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. మఠం దివాన్ సదీంద్ర ఆచార్, గౌతమ్, ఆచార్, ఆనందతీర్థాచార్, శ్రీపతిఆచార్ పాల్గొన్నారు.



పీఠాధిపతులతో మాట్లాడుతున్న జీవీవో పాండురంగారెడ్డి, ఏఏవో మాధవశెట్టి

ఎదురు చూపులే..!

● వేతనాల కోసం సమగ్ర శిక్ష ఉద్యోగుల అగచాట్లు
● బడ్జెట్ వస్తేనే వేతనాలు
● కూటమి ప్రభుత్వంలో కూడా తప్పని కష్టాలు



ఆలూరు, సెప్టెంబరు 11: ప్రభుత్వాలు మారినా సమగ్ర శిక్ష ఉద్యోగుల కష్టాలు మాత్రం గట్టెక్కడం లేదు. ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీ రాగానే వేతనాలు అందుతున్నా సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రం ప్రతి నెల వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి ప్రభుత్వ శాఖలో విధులు నిర్వహించే ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం విడుదల చేసి సంబంధిత శాఖల హెచ్‌ఓడీల ద్వారా కాంట్రాక్ట్ ఉద్యోగులకు నేరుగా వేతనాలు జమచేస్తూ.. ఔట్ సర్సింగ్ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ (ఆప్కాస్) ద్వారా వేతనాలు ప్రతి నెల 1వ తేదీ వేతనాలు జమ అవుతున్నాయి. అయితే సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న వారికి మాత్రం బడ్జెట్ రెండు, మూడు నెలలకు ఒక్కసారి విడుదల అవుతోంది. దీంతో రెండు నెలలకు లేదంటే 3 నెలలకు ఒక్కసారి వేతనాలు జమ చేస్తున్నారు. దీంతో జిల్లాలో ఆ శాఖ పరిధిలోని ఉన్న కేజీబీవీలు అర్బీలు, మోడల్ హాస్టల్ వార్డెన్లు, వంట చేసేవారు, వాచ్‌మన్లు, మెసెంజర్లు, అకౌంటెంట్లు, డేటా ఎంట్రి ఆపరేటర్లు, ఎంఈఎస్‌కో ఆర్డినేటరులు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు ఇలా మొత్తం 550 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం కలిపి నిధులు కేటాయిస్తారు. ఒకటో తేదీ వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సక్రమంగా వేతనాలు వస్తాయని ఆశించిన ఉద్యోగులకు అవే కష్టాలు తప్పడం లేదంటున్నారు చిరుద్యోగులు. వార్షిక బడ్జెట్‌ను విడుదల చేసిన ప్రతి నెల సక్రమంగా వేతనాలు అందేలా చూడాలని కోరుతున్నారు.



●వార్షిక బడ్జెట్ విడుదల చేయాలి



అన్ని ప్రభుత్వ శాఖల తరహాలో సమగ్ర శిక్ష పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించేందుకు వార్షిక బడ్జెట్‌ను విడుదల చేయాలి. వేతనాలు సకాలంలో రాకపోవడంతో ఇంటి అద్దెలు, కుటుంబ పోషణ భారంగా మారుతున్నాయి. ప్రభుత్వం దృష్టికి సారించి న్యాయం చేయాలి.

- మహ్మద్ రఫీ, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ

2029లో అధికారంలోకి రావడమే లక్ష్యం

- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, సెప్టెంబరు 11: కేంద్ర, రాష్ట్రాల్లో 2029లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కార్యాచరణ అమలు చేస్తామని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. బుధవారం ఆంధ్రరత్న భవన్‌లో డీసీసీ అధ్యక్షుడిగా ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల నుంచి లక్ష్మీనరసింహ యాదవ్ నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు షర్మిల ఇచ్చిన బాధ్యతను నెరవేరుస్తూ ప్రజలకు మరింత చేరువై కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానన్నారు. పార్టీలోని అన్ని వర్గాలను కలుపుకొనిపోతానని పేర్కొన్నారు. వరుసగా మూడోసారి డీసీసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నూతన ఇన్‌చార్జులను ఏడురోజుల్లోనే నియమిస్తామని తెలిపారు. బూత్ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు కొత్త కమిటీలు ఏర్పాటు చేస్తామని వివరించారు.



షర్మిల నుంచి నియామక పత్రం అందుకుంటున్న లక్ష్మీనరసింహ యాదవ్

హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా పదోన్నతి

కర్నూలు, సెప్టెంబరు 11: ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 11 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో యు. రామచంద్ర (గోనెగండ్ల పీఎస్), ఎస్.ఈరన్న (గూడూరు పీఎస్), ఈ. గిడ్డయ్య గౌడు (హాలహర్వి పీఎస్), ఎం.శాంతరాజు (ఫ్యాక్షన్ జోన్ అటాచ్డ్ టూ పెద్దకడుబూరు పీఎస్), జి. పాండు రంగ స్వామి (పాణ్యం పీఎస్), వి.సంజీవుడు (బ్రాహ్మణకొట్కూరు పీఎస్), ఎం. సిఖిందర్ మిర్జా (కర్నూలు టూటౌన్ పీఎస్), వి. శ్రీనివాసరాజు (రుద్రవరం పీఎస్), ఏ. బాలరాజు (డీఎస్‌బీ, కర్నూలు), కె. వెంకటేశ్వర చౌదరి (పెద్దతుంబళం పీఎస్), పి.హరినాథ్ బాబు (ఆదోని తాలుకా పీఎస్)లు ఉన్నారు.

రవాణా శాఖ కార్యాలయం ముట్టడి

కర్నూలు, సెప్టెంబరు 11: డ్రైవింగ్ టెస్టులు, వాహనాల ఫిట్‌నెస్ టెస్టులను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్న నేపథ్యంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం డీటీసీ కార్యాలయాన్ని ముట్టడించారు ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాహనదారులకు పనులు సులభతరం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేయాలి తప్ప.. జీవోలు తీసుకువచ్చి ఆర్టీయే కార్యాలయాలను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడం తగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి. రాధాకృష్ణ, నాయకులు పి. మహమూద్ రవి, గంగాధర్, షంషేర్ కుమార్, మల్లి, నాగరాజు, నబీ, మాలిక్, శ్రీను, కరుణ, రామమద్దయ్య, సిద్ధయ్య, గంగాధర్ పాల్గొన్నారు.



డీటీసీకి వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఆన్‌లైన్ వెబ్‌సైట్ పేరుతో మోసం

కర్నూలు, సెప్టెంబరు 11: నగరంలోని వెంకటాద్రినగర్‌కు చెందిన ఆదిత్య అనే వ్యక్తి ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా మోసపోయానంటూ బుధవారం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. కొన్ని రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ వెబ్‌సైట్‌ను క్లిక్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆ వెబ్‌సైట్ నిర్వాహకులు ఆశ చూపారు. ఇందుకోసం కొంత పెట్టుబడి పెట్టాల్సి ఉందన్నారు. వారి మాటలను నమ్మిన ఆదిత్య రూ.11.50 లక్షలను వారి ఖాతాకు బదిలీ చేశాడు. ఆ తర్వాత మరి కొంత పెట్టుబడి పెట్టాలని చెప్పడంతో మొదట పెట్టిన పెట్టుబడికి లాభాలు ఇవ్వాలని బాధితుడు డిమాండ్ చేశాడు. దీంతో ఆ వెబ్‌సైట్ నిర్వాహకుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. తాను మోసపోయానని గుర్తించిన ఆదిత్య సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. సైబర్ క్రైమ్ పోలీసులు ఆ వెబ్‌సైట్ నిర్వాహకుల బ్యాంకు ఖాతాను సీజ్ చేయడంతో రూ.9 లక్షల మేర మిగిలింది. మిగతా మొత్తం అప్పటికే స్వాహ చేసినట్లు పోలీసులు గుర్తించారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు విరాళాలు



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న బంగారు దుకాణాల యజమానులు

ఆత్మకూరు, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ఆత్మకూరు బంగారు దుకాణాల యాజమాన్యం అసోసియేషన్ వారు వేల్పనూరులో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్వగృహంలో కలిసి రూ.3,01,116 విరాళాన్ని అందజేశారు. అలాగే శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి తరుపున రూ.లక్ష, ఎంఎం గార్డెన్ యజమాని మోమిన్ మున్నా రూ.25వేలు విరాళం అందజేశారు. ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ.. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఆపదలో ఉన్న వారికి మానవత్వంలో ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. అంతకుముందు బంగారు దుకాణాల అసోసియేషన్ వారు ఎమ్మెల్యే బుడ్డాను ఘనంగా సత్కరించారు. సంఘం ఉపాధ్యక్షుడు ఆర్ఎం.వలి, కార్యదర్శి సుభానీ, కోశాధికారి వలి బాషా, సభ్యులు శేషఫణి, తబ్రేష్, వెంకటేష్, ప్రవీణ్‌కుమార్, షఫి, అస్లాం, సుభానీ, జబీవుల్లా, నజీర్ అహ్మద్, వేణుగోపాల్, ఖాదర్‌బాషా ఉన్నారు.

కార్యకర్తకు పరామర్శ



కార్యకర్తను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

మహానంది, సెప్టెంబరు 11: మండలంలోని మసీదుపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బాలనర్సి అనారోగ్యంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చంద్రమౌళీశ్వరరెడ్డి బుధవారం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలనర్సిని పరామర్శించారు. ఖర్చుల కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఇటీవల వినాయక నిమజ్జనంలో భాగంగా పాముకాటుకు గురైన అదే గ్రామానికి చెందిన నరసింహుడుకు రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేసారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం మసీదుపురం గ్రామంలో రూ.45 వేలు వసూలు చేసినట్లు మౌళీశ్వరరెడ్డి తెలిపారు.

'పంట నమోదు తప్పనిసరి'



నల్లకాలువ గ్రామంలో ఈకేవైసీని పరిశీలిస్తున్న ఏడీఏ

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 11: ప్రతి రైతు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు అంజనేయ,ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మండలంలోని నల్లకాలువ, కరివేన గ్రామాల్లో ఈ పంట నమోదు,ఈ కేవైసీ కార్యక్రమాలను బుధవారం పర్యవేక్షించారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: రైతులు తము సాగు చేసిన పంటలను నమోదు చేయించాలని ఏవో స్వాతి సూచించారు. మండలంలోని ఈర్నపాడు గ్రామంలో బుధవారం రైతుల సహకార కేంద్రంలో పంట, ఈకేవైసీ నమోదును ఆమె పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోగా ప్రతి రైతు పంట, ఈకేవైసీ ఆయా గ్రామాల్లోని వీఏఏల వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు. నమోదు చేసుకుంటేనే రైతు పథకాలకు అర్హులవుతారని చెప్పారు. వీఏఏ సామ్రాట్ పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని రైతులు ఈ నెల 15లోపు పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు. పాములపాడులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రైతులు తాము సాగుచేసిన పంటను రైతుసేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 19 నుంచి 24 వరకు రైతు సేవా కేంద్రాలలో పంట నమోదు జాబితాను ప్రదర్శించి, గ్రామసభ నిర్వహించి అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు. ఈ నెల 30న తుది జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'వందశాతం పూర్తి'

వెలుగోడు: వెలుగోడు మండలంలో వందశాతం పంటనమోదు కార్యక్రమం నమోదు అయినట్లు ఏవో పవన్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 11,860 ఎకరాల్లో పంట నమోదు చేశామని చెప్పారు. పంట నమోదుకు సంభందించి రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఈ నెల 19 నుంచి 24 వరకు రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట నమోదు జాబితాను ప్రదర్శన చేసి, గ్రామసభ నిర్వహించి అభ్యంతరాలు స్వీకరిస్తమని చెప్పారు. 30న తుది జాబిత ప్రచురించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి'

కొత్తపల్లి, సెప్టెంబరు 11: అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని జడ్పీటీసీ సభ్యుడు సోముల సుధాకర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం ఎంపీపీ కుసుమలత అధ్యక్షతన ఎంపీడీవో మేరీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న మాట్లాడుతూ మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలకు భారీ ఎత్తున నష్టం జరుగ్గా.. 35 గృహాలు కూడా దెబ్బతిన్నట్లు గుర్తించామని చెప్పారు. నష్టపరిహారం కోసం కలెక్టర్‌కు నివేధించినట్లు చెప్పారు. ఎంపీడీవో మాట్లాడుతూ నిలిచిపోయిన వర్మీ కంపోస్టు షెడ్లను ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. పీఆర్ డీఈ ధనిబాబు మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వానికి నివేధించినట్లు చెప్పారు. ఎర్రమటం, ముసలిమడుగు, గువ్వలకుంట్ల, శివపురం, దుద్యాల, జడ్‌వారిపల్లి, వీరాపురం గ్రామాల్లో విద్యుత్ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వీటిని తక్షణమే పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు ఎంపీడీవో మేరీ ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద మండలానికి రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యాయని, టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఏసీడీపీవో మంగవల్లి మాట్లాడుతూ మండలంలో ఏడు అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరయ్యాయని, అయితే నిధుల్లేక నిర్మాణాలు నిలిచిపోయాయని చెప్పారు. అలాగే కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కూడా లేదని సభాదృష్టికి తెచ్చారు. ఎంఈవో-2 ఇనయతుల్లా మాట్లాడుతూ బడి మానేసిన విద్యార్థులు ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైద్యాధికారులు మహ్మద్ భేగ్, జబీర్, ఏపీవో రేష్మా, ఏపీఎం పుల్లయ్య, హౌసింగ్ ఏఈ పాండురంగనాయక్, మత్స్యశాఖ అధికారి భరత్‌లాల్ నాయక్, ఏవో మహేష్, ఉద్యానశాఖ అధికారి చందన తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి వీడ్కోలు

● ఘనంగా గణనాథుడి నిమజ్జనం ● ప్రత్యేక పూజలు చేసిన భక్తులు ● అన్నదానం ఏర్పాటు చేసిన నిర్వాహకులు



నంద్యాలలో నిమజ్జనంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



నంద్యాలలో నిమజ్జన పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 11: నంద్యాలలో వినాయక నిమజ్జనం సందర్భంగా గణేష్ కేంద్ర సమితి ఆధ్వర్యంలో నిమజ్జనం కు వెళ్ళే వినాయకులకు, నిర్వాహకులకు స్వాగత సభ ఏర్పాటు చేశారు. గణేష్ నిర్వహకులకు మెమెంటో ఇచ్చి సత్కరించారు. ఈ స్వాగత సభలో పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే నిమజ్జన కార్యక్రమానికి సహకరించిన అదికారులను, ప్రజాప్రతినిధులను గణేశ్ కేంద్ర సమితి ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో గణేష్ కేంద్ర సమితి సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నంద్యాల బొమ్మలసత్రం బాలగణేశ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం దగ్గర గల లడ్డూను బొమ్మలసత్రానికి చెందిన నలంద స్కూల్ అధినేత ఉత్తేజ్‌కుమార్ రూ.1,21,000కు దక్కించుకున్నారు. పట్టణంలో వినాయకుడి లడ్డు ధర లక్షకు పైగా పలకడం ఇదే తొలిసారి. వేలం పాటలో పాడిన లడ్డును భక్తులకు పంచారు. నంద్యాల సింఫోనిహైట్స్‌కు వినాయకుని విగ్రహం వద్ద వుంచినలడ్డును రూ.6116కు దండే సుదర్శన్ రెడ్డి వేలం పాటలో దక్కించుకున్నారు.

నంద్యాల క్రైం: నంద్యాల జిల్లా కేంద్రంలోని చిన్న చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన వినాయక ఘాట్‌లో గణేశ్ నిమజ్జన కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా మొదటి గణేష్ విగ్రహానికి పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని ఎస్పీ అధిరాజ్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమం శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో సాగాలని ఆకాంక్షించారు. నంద్యాల డీఎస్పీ యుగంధర్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐలు మోహన్‌రెడ్డి, ఎరిషావలి, నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలో గణేశుడి నిమజ్జన వేడుకలు శోభాయమానంగా జరిగాయి. బుధవారం నందికొట్కూరు పట్టణంలో ఐదు రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథులు నిమజ్జనానికి సిద్ధమయ్యారు. పట్టణంలోని సెరాఫ్ బజార్, కోటావీధి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్, సుబ్బారావుపేట తదితర కాలనీల్లో ఏర్పాటు చేసిన గణపయ్యలకు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పూజలు నిర్వహించి నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు. పట్టణంలో దాదాపు 80కి పైగా ఉన్న ఉగ్రహాలు మండపాల నుంచి బయలుదేరి పట్టణ పురవీధుల్లో భక్తులు కోలాటాలు, భజనలు, బాజాబజంత్రీల నడుమ ఆటపాటలతో ఊరేగింపు కొనసాగించారు. ఒక్కొక్కటిగా నందికొట్కూరులోని ప్రధాన రహదారి వెంట పటేల్ సెంటర్‌కు చేరుకున్నాయి. అక్కడి నుంచి బయలుదేరి జూపాడుబంగ్లా వద్ద ఉన్న కేసీ కెనాల్‌కు గణనాథులు చేరుకున్నారు. అక్కడ శివపుత్రుడైన లంబోదరుడు గంగమ్మ ఒడిలోకి చేరుకున్నారు. పట్టణ సి.ఐ ప్రవీణ్‌కుమార్, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ముచ్చుమర్రి, జూపాడుబంగ్లా, మిడ్తూరు, నందికొట్కూరు, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐలు వారి వారి సిబ్బందితో కలిసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు బంధోబస్తును ఏర్పాటు చేశారు. పట్టణంలోని గణనాథులను తిలకించేందుకు పట్టణ ప్రజలు పటేల్ సెంటర్‌లో బారులుదీరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:

పటేల్ సెంటర్‌లో కేంద్ర గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించారు. శ్రీనవనంది పాఠశాలకు చెందిన విద్యార్థులు చేసిన పిరమిడ్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు మెమెంటోలను కేంద్ర గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు. నీలిశికారి కాలనీకి చెందిన భక్తులు వందల సంఖ్యలో కోలాటం, ఆటపాటలతో గణనాథులను నిమజ్జనానికి తరలించారు. కేంద్రగణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు, విద్యుత్‌శాఖ ఏ.ఈ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, కేంద్రగణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీధర్, సభ్యులు శ్రీకాంత్‌గౌడ్, భాను, సోమలింగేశ్వరుడు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణనాథులు బుధవారం సాయంత్రం అశేష భక్తజనం మధ్య గంగమ్మ ఒడికి చేరుకున్నారు. చివరిగా మండలంలోని 12 గ్రామా పంచాయతీలు ఉండగా.. అందులో 9 గ్రామ పంచాయితీల్లో వినాయకులను నిమజ్జనం చేయగా.. బుధవారం దుద్యాల, ఎదురుపాడు గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు గణనాథులను గ్రామ వీధుల గుండా శోభాయాత్రలో యువతీ యువకులు ఉత్సాహం, కేరింతలు, డప్పు వాయిద్యాల మధ్య సందడి చేశారు. దుద్యాలలో గణనాథులను పాములపాడు మండలంలోని ఇస్కాల గ్రామ శివారులోని తెలుగుగంగలో నిమజ్జనం చేశారు. అలాగే ఎదురుపాడు గణనాథులను గ్రామ శివారులోని తిమ్మరాజుగుట్ట చెరువులో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఆత్మకూరు డీఎస్పీ రామాంజనాయక్ ఆదేశాల మేరకు ఎస్ఐ కేశవ ఆధ్వర్యంలో సిబ్బంది గట్టి బందోబస్తు చేపట్టారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా వద్ద కేసీ కాలువలో బుధవారం గణనాథులను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఐదురోజుల నుంచి కొలువైన గణనాథులను నందికొట్కూరు పట్టణానికి చెందిన విగ్రహాలు, జూపాడుబంగ్లాకు చెందిన రెండు విగ్రహాలను భారీ ఊరేగింపుతో వచ్చి మేళాతాళాలతో నిమజ్జనం చేశారు. రంగులతో భక్తులు ఆనందోత్సవాల మధ్య నిమజ్జనం చేశారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమాణ్యం, ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో నూర్జహాన్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శాంతయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా లైట్లు, బారికేడ్లు, కాలువలో చేపల వేటగాళ్లను ఉంచి భద్రత ఏర్పాటు చేశారు.

పాణ్యం: మండలంలో గణేశ్ నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. మండలంలోని కుందూ, ఎస్ఆర్‌బీసీ, చెరువులలో గణేశ విగ్రహాలను ప్రశాంతంగా నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పాణ్యం ఊరి ముందరి చెరువులో పెద్ద ఎత్తున గణేశ్ విగ్రహాలను కట్టుదిట్టం మధ్య నిమజ్జనం చేశారు. ఉదయం గణేశ్ విగ్రహాలకు భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జనానికి తరలించారు. యువకులు, మహిళలు పిల్లలు రంగులు చల్లుకుంటూ సంతోషంగా పాల్గొన్నారు.

మహానంది: మహానందిలో వినాయక నిమజ్జనోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా క్షేత్రం పరిధిలో ఉన్న 12 గణేశ్ మండపాల వద్ద విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో జరిపారు. గణపతి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఆశీనులుజేశారు. అనంతరం మేళతాళాలతో, చెక్క భజన, కోలాట నృత్యాల మధ్య మహానంది పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఎం.తిమ్మాపురంలో గణపతి విగ్రహాలను నిమజ్జనం పురష్కరించుకొని గ్రామంలో ప్రజలు ఊరేగింపు చేశారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం మహానంది శివారు ప్రాంతంలోని తెలుగుగంగ ప్రధాన కాల్వ వినాయక ఘాట్ వద్ద భక్తిశ్రద్ధలతో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.



నంద్యాలలో పరిపాలన గణపతికి పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పాణ్యంలో డ్యాన్స్ చేస్తున్న పెద్దలు, పిల్లలు



మహానందిలో..



కొత్తపల్లి: దుద్యాల గ్రామంలో..



నందికొట్కూరులో..



'అమరుల సేవలు చిరస్మరణీయం'



అమరులకు నివాళి అర్పిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా

ఆత్మకూరు, సెప్టెంబరు 11: అటవీశాఖలో అమరుల సేవలు చిరస్మరణీయమని ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా అన్నారు. బుధవారం అటవీశాఖ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డివిజన్ కార్యాలయంలో అటవీ అమరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు దోహదపడే అడవుల సంరక్షణకు అటవీశాఖ విశేషంగా కృషిచేస్తోందని చెప్పుకొచ్చారు. అయితే అటవీరక్షణలో స్మగ్లర్ల చేతిలో పలు సందర్భాల్లో అటవీ సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని చెప్పారు. ప్రత్యేకించి ఆత్మకూరు అటవీ డివిజన్‌లో రేంజర్ రామయ్య మావోయిస్టుల చేతుల్లో మృతిచెందడం బాధాకరమని అన్నారు. ఆత్మకూరు రేంజర్ పట్టాభి, యాంటి పోచింగ్ రేంజర్ సుభాష్ సిబ్బంది ఉన్నారు. బైర్లూటి రేంజ్‌లోని దివంగత అటవీ రేంజ్ అధికారి రామయ్య స్థూపం వద్ద నాగలూటి రేంజర్ దొరస్వామి పుష్పాంజలి ఘటించారు. ఏపీ డిప్యూటీ రేంజర్స్ అండ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణగౌడ్ ఆధ్వర్యంలో కరివేన సమీపంలోని మానవతా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

ఎరువుల విక్రయం నిలిపివేత

మహానంది, సెప్టెంబరు 11: మండలంలోని గాజులపల్లి దీప్తిపెస్టిసైడ్స్ దుకాణంతో పాటు గఫారియా ఎరువుల దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 47.8 మెట్రిక్ టన్నులు స్టాక్ నిల్వలను సీజ్ చేసినట్లు నంద్యాల రూరల్ వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్ తెలిపారు. బుధవారం గ్రామంలోని ఎరువుల దుకాణాలను ఏడీఏ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లో అధికంగా ఎరువుల నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ. 14.52 లక్షలు ఉంటుందని అన్నారు. ఎరువుల అమ్మకాలను నిబంధనలకు విరుద్ధంగా రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఏడీఏ హెచ్చరించారు. షాపుల ముందు స్టాక్ నిల్వలతో పాటు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న పొదుపు మహిళలు

గడివేముల, సెప్టెంబరు 11: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం మహిళా సమాఖ్య మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. మహిళ సమాఖ్య మండల అధ్యక్షురాలిగా ఎల్లమ్మ, ఉపాధ్యక్షు రాలిగా జయమ్మ, సెక్రెటరీగా లలిత, సహకార్యదర్శిగా రేష్మా, ట్రెజరర్‌గా సుభద్రమ్మ, మండల పొదుపు మహిళా సమాఖ్య సంఘం గౌరవ సలహా దారుగా సుభద్రమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏపీఎం హజరత్ ఉస్మాన్ తెలిపారు. నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

'టీడీపీ నాయకుల సేవలు అభినందనీయం'

పాములపాడు, సెప్టెంబరు 11: వేంపెంట గ్రామంలో అతిసార బాధితులకు అండగా ఉంటూ దాదాపు రూ.80వేలు మేర సొంత డబ్బును వెచ్చించి సహాయక సేవలు చేసిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రామసుబ్బమ్మ, కుమారుడు డాక్టర్ టేకూరి నాగేశ్వరరావును గ్రామస్థులు, బాధితులు అభినందించారు. గత నెల 29 నుంచి ఎనిమిది రోజుల పాటు వైద్య సిబ్బందికి భోజన వసతులు, రోగులకు రూ.20వేల మందులు, సమయానికి 108 వాహనం అందుబాటులో లేకుంటే అత్యవసరంగా ప్రైవేటు అద్దె కార్లు సమకూర్చి తమవంతుగా సాయం చేశారన అన్నారు. నాగేశ్వరరావు సింగపూర్‌లో సాఫ్ట్‌వేరు రంగంలో విధులు నిర్వహిస్తూ గ్రామంలో ఎప్పటి కప్పుడు విషయాలను తెలుసుకొంటూ స్థానిక టీడీపీ నాయకులు, తల్లి రామసుబ్బమ్మ ద్వార సేవలందించారని అన్నారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, అధికారులు, నాయకులు వీరి సేవలను అభినందించారు.

లోపించిన పారిశుధ్యం

● డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

● బురదమయంగా మారిన రహదారులు

● రోగాల బారిన ప్రజలు



ఇస్కాలలో బురదమయంగా మారిన రోడ్డు

పాములపాడు, సెప్టెంబరు 11: ఇటీవల తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురవడంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. రహదారిలో నడవడానికి కూడా వీలులేని దుస్థితి నెలకొంది. తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు చేపడున్నారు. దీంతో గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. మండలంలోని ఇస్కాల, లింగాల, చెలిమిళ్ల, తుమ్మలూరు, ఎర్రగూడూరు, మిట్టకందాల, రుద్రవరం తదితర గ్రామాల్లో చినుకు పడితే చాలు వీధులు చిత్తడిగా మారుతున్నాయి. ఇస్కాల గ్రామం ఎస్సీ, బీసీ కాలనీలలోని లాలీ కాలువల్లో వ్యర్థాలు పేరుకపోయాయి. దీంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిట్టకందాలలో నిత్యం రోడ్డు మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఇస్కాల గ్రామంలో వ్యర్థాలతో పేరుకుపోయిన డ్రైనేజీ

'చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం'



పోషకాహార స్టాళ్లను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కొత్తపల్లి, సెప్టెంబరు 11: చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీపీ కుసుమలత, ఎంపీడీవో మేరీ, జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, ఏసీడీపీవో మంగవల్లి అన్నారు. కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక మహా వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాల స్టాళ్లను పరిశీలించి రుచి చూశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పోషకాహారంపై ఏసీడీపీవో అవగాహన కల్పించారు. చిరుధాన్యాల్లో ఎన్నో రకాల వంటకాలు తయారు చేసుకోవచ్చని ఆమె చెప్పారు. కార్యక్రమంలో డీటీ పెద్దన్న, సూపర్‌వైజర్లు నాగేశ్వరమ్మ, ఆశీర్వాదమ్మ, వైద్యాధికారులు మహ్మద్ భేగ్, జబీర్, ఆయా శాఖల అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. బుధవారం మహానంది మండలం గోపవరం గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా జడ్పీ పాఠశాల ఆవరణలో అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాల గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రసన్నలక్ష్మి, లక్ష్మి నిర్మల, తేజస్విని, జ్యోతి ఉషారాణి, గౌరి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోండి


ఐటీ మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 11: విజయవాడలో సంభవించిన వరదల మూలంగా నష్టపోయిన వారిని ఆదుకోవాలని ఐటీ మంత్రి నారా లోకేష్‌ను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ కోరారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలోని 47వ డివిజన్‌కు ఇన్‌చార్జీగా ఎమ్మెల్యేను ఐటీ మంత్రి నియమించడంతో ఆమె పర్యటించి వరదల్లో నష్టపోయిన బాధితుల వివరాలను అందించారు. అలాగే ఆళ్లగడ్డలో రాజకీయ పరిస్థితిని మంత్రికి వివరించినట్లు చెప్పారు.

వరద బాధితులకు నిత్యావసర కిట్ల పంపిణీ

డోన్, సెప్టెంబరు 11: విజయవాడలోని వరద బాధితులకు నిత్యావసర కిట్లను అందజేసేందుకు డోన్ టీడీపీ నాయకులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో సేకరించిన నిత్యావసర కిట్లను ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, రామదుర్గం జయరాముడు, ఎల్‌ఐసీ శ్రీరాములు తదితరులు విజయవాడలోని 56వ డివిజన్‌లో ఎంపీ కేశినేని చిన్నితో కలిసి బాధితులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వలసల రామకృష్ణ, శ్రీనివాసులు యాదవ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని స్ఫూర్తిగా తీసుకుని బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చామన్నారు.

నదిలో కనిపించిన మందుల గుర్తింపు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 11: మండలంలోని కుందూనదిలో కనిపించిన మందులు మాయలూరు గ్రామ పీహెచ్‌సీవిగా గుర్తిం చినట్లు జిల్లా ప్రాజెక్టు అధికారి జగదీష్‌చంద్రారెడ్డి తెలిపారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' పత్రికలో కుందూనదిలో మందులు అన్న శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. దీనికి జిల్లా వైద్యాధికారులు స్పందించి ఆయా ప్రాథమిక వైద్యశాలల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయలూరు వైద్యశాల నుంచి రూపనగుడి గ్రామానికి ఆటోలు వైద్య సిబ్బంది మందులు తీసుకెళ్తుండగా, కుందూనది వంతెన వద్దకు రాగానే ఆటోలో నుంచి జారీ కిందపడిపోయినట్లు తెలిపారన్నారు. అయితే ఆ మందులు కాలం చెల్లినవి కావని, ఈ నెల 25వ తేదీ వరకు వాటికి సమయం ఉందన్నారు. అక్కడ నుంచి 21 రకాల మందులు సేకరించి వైద్యశాలలో ఉంచామన్నారు. దీనిపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట అడిషన్ డీఎంహెచ్‌వో శారదాభాయి ఉన్నారు.

'అటవీశాఖలో విధులు సాహసోపేతం'

రుద్రవరం, సెప్టెంబరు 11 : అటవీశాఖలో విధి నిర్వహణ సాహసంతో కూడుకున్నదని రేంజర్ శ్రీపతినాయుడు అన్నారు. బుధవారం రుద్రవరంలో అటవీశాఖ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. వన్యప్రాణులు, వివిధ ఘటనల్లో మృతి చెందిన అటవీశాఖ అధికారుల ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు ముక్తర్‌బాషా, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హౌసింగ్ పని దినాలు పూర్తి చేయండి

రుద్రవరం, సెప్టెంబరు 11 : ఉపాధి పథకం నుంచి గృహ నిర్మాణ పథకానికి కేటాయించిన పనిదినాలు వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో మధుసూదనరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా గృహ నిర్మాణ శాఖ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ నాగరాజు, ఏపీవో ప్రతాప్ పాల్గొన్నారు.

స్కాలర్ షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 11: మండలంలోని బలిజ కుల విద్యార్థులకు రోపా సంస్థ ఆధ్వర్యంలో అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు అర్జిగారి నరసింహుడు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతి, పై చదువులు చదువుతున్న బలిజ కుల విద్యార్థులకు ఉమ్మడి కర్నూలు జిల్లా రాయల అఫిషియల్స్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్నామన్నారు. అర్హులైన బలిజకుల విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నిబంధనలు పాటించని స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 11: పట్టణంలోని రీడ్ పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పవన్ బుధవారం డిమాండ్ చేశారు. బుధవారం ఎంఈవో కార్యాలయ సూపరింటెండెంట్ సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సరైన అనుమతులు లేకుండా నిబంధనలు తుంగలో తొక్కి ఒకే బిల్డింగులో స్కూల్, కళాశాల నిర్వహిస్తున్నారని తెలిపారు. పుస్తకాలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సొహైల్, మున్నా పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

బేతంచెర్ల, సెప్టెంబరు 11: ఏపీ ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్ ప్రవేశాలకు రూ.200లతో తుది గడువు ఈ నెల 25వరకు అవకాశం ఉందని భాగ్యోదయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కానాల నాగలక్ష్మి దేవి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పూర్తి వివరాలకు పాఠశాల పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు. పబ్లిక్ పరీక్షలు మార్చి, ఏప్రిల్ నెలల్లో ఉంటాయని తెలిపారు. ప్రతి రెండో శనివారం, ఆదివారం పాఠశాలలో తరగతులు ఉంటాయన్నారు. చదువు మధ్యలో ఆపేసిన వారు, ప్రభుత్వ ఉద్యోగులు పదోన్నతి కోసం ఈ కోర్సుల్లో చేరి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

బనగానపల్లె , సెప్టెంబరు 11: మండలంలోని టంగుటూరు జడ్పీ ఉన్నతపాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడంతో ఆయనను బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం పర్వీన్‌బాను, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రాజశేఖర్, సుబ్బారెడ్డి, గోపాల్‌రావు, యాగంటీశ్వరుడు, ఓబయ్య, రఫీ, హమీదాబేగం, ఐజయ్య తదితరుఉల పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం ఇవ్వాలి

చాగలమర్రి, సెప్టెంబరు 11: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యతగల భోజనం ఇవ్వాలని ఎంఈవో న్యామతుల్ల పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నగల్లపాడు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పట్టించాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లలితకుమారి ఉన్నారు.

రాధాకృష్ణులకు పూజలు


రాధాకృష్ణులకు అభిషేకం చేస్తున్న మేనేజరు చంద్రకేశవదాస్, లోకేశ్వరి మాతాజీ

రుద్రవరం, సెప్టెంబరు 11 : మండలంలోని ఇస్కాన్ అహోబిళం దేవాలయంలో రాధా ష్టమి వేడుకలు బుధవారం నిర్వహిం చారు. ఇస్కాన్ మేనేజరు చంద్రకేశవదాస్ లోకేశ్వరి మాతాజీ రాధా క్రిష్ణులకు అభిషేకంగా చేశారు. రాధారాణికి పది రకా ల పుష్పాభిషేకం, 108 రకాల శంఖాభిషేకం, మహా నైవేద్యం ఏర్పాటు చేశారు.


బనగానపల్లెలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు



పెండేకంటినగర్: ఉట్టి కొడుతున్న యువకులు


వివిధ వేషధారణలతో విజయవాడ కళాకారులు


కోవెలకుంట్ల నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

కోలాహలంగా గణేశ్ నిమజ్జనం

- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- యువకులు, మహిళల నృత్యాలు

బనగానపల్లె/డోన్/రూరల్/ఆళ్లగడ్డ/సంజామల/కోవెలకుంట్ల/ సెప్టెంబరు 11: బనగానపల్లె, డోన్, ఆళ్లగడ్డ, సంజామల తదితర ప్రాంతాల్లో ఐదు రోజులుగా పూజలందుకున్న గణేశులు బుధవారం నిమజ్జనానికి తరలివెళ్లారు. ఉదయం నుంచే మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అ నంతరం సంప్రదాయబద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ మహిళలు, యువకులు, నృత్యాలుచేస్తూ నిమజ్జనానికి తరలించారు.

● బనగానపల్లె పట్టణంలో పెండేకంటినగర్‌లో ఉట్టికొట్టే పోటీలు ఆకట్టుకున్నాయి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశ్ నిమజ్జనం సందర్భంగా విజయవాడకు చెందిన కళాకారులు వివిధ వేషధారణలతో చేసిన నృత్యాల ఊరేగింపు పలువురిని ఆకట్టుకుంది. పట్టణంలోని పెండేకంటినగర్, కొండపేట, పొట్టి శ్రీరాముల కూడలి, సీఐ కార్యాలయం, ఆస్థానం రోడ్డు, పాత ఆంధ్రాబ్యాంక్, పెట్రోల్‌బంకు, జీఎం టాకీస్ మీదుగా కైప చెర్వుకు ఊరేగింపుగా విగ్రహాలు బయలుదేరాయి. ఈసందర్భంగా నెహ్రూస్కూల్ యాజ మాన్యం భక్తులకు మజ్జిగ పాకెట్లు అందించగా, గణేశ్ నిమజ్జన కమిటీ ఆధ్వర్యంలో పెట్రోల్‌బంకు కూడలిలో అల్పాహారం, పలుకూరు వైద్యశాల సిబ్బంది మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. మండలంలోని కైప చెర్వు వద్ద గణేశ్ నిమజ్జం సందర్భంగా ప్రత్యేక క్రేన్‌ల ద్వారా నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పట్టణంలో బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి, కృష్ణయ్య, ఎస్‌ఐ దుగ్గిరెడ్డి, నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, పోలీస్ సిబ్బంది ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఊరేగింపు కార్యక్రమాన్ని ఉత్సవ కమి టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, సలహాదారు టంగుటూరు శ్రీనయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అలాగే యాగంటిపల్లె గ్రామంలో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.


డోన్‌లో జలహారతి ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ


డోన్ పట్టణంలోని అబిరెడ్డిపల్లె చెరువులో నిమజ్జనమవుతున్న గణనాథుడు

● డోన్ పట్టణంలో బుధవారం నిర్వహించిన గణేష్ నిమజ్జన వేడుకల్లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ప ట్టణంలోని అమ్మవారిశాల వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి, స్థానిక టీడీపీ కార్యా లయ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోట్రికే ఫణిరాజ్, మునిసిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, తహసీల్దార్ నాగమణి, రూరల్ సీఐ సీఎం రాకేష్‌లతో కలిసి అబిరెడ్డిపల్లె చెరువులో వద్ద నిమజ్జన వేడుకలను ఎమ్మెల్యే కోట్ల తిలకించారు. అలాగే గణేష్ నిమజ్జన కార్యక్రమంలో డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

● ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించారు. పట్టణ శివార్లలోని వక్కిలేరు వాగులో గణనాథులను గణేష్ ఉత్సవ కమిటీసభ్యుల ఆధ్వర్యంలో నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● సంజామల మండల కేంద్రంలో కొలువుదీరిన గణపయ్యలను బుధవారం నిమజ్జనం చేశారు. గ్రామ టీడీపీ నాయకులు పెండేకంటి కిరణ్ కుమార్, గ్రామ సంఘం పెద్దలు, గ్రామస్థుల సహకారంతో ఐదు రోజుల పాటు లంబోదరులకు ప్రత్యేక పూజలు, నైవేద్యా లు సమర్పించి మధ్యాహ్నం నుంచి గ్రామోత్సవం నిర్వహిం చారు. గణపయ్యలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్థాని క పాలేరులో నిమజ్జనం చేశారు.

● కోవెలకుంట్ల పట్టణంలో బుధవారం అత్యంతవైభవంగా వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని సంతపేట, రంగరాజుపేట, ఎల్ఎంకాంపౌండు, జమ్మలమడుగు చౌరస్తా, ఆర్టీసీ బస్టాండు మీదుగా వివిధ విగ్రహాలను వైభవంగా ఊరేగించుకుంటూ కుందూ వద్దకు తీసుకెళ్లి అక్కడ నిమజ్జనం చేశారు.


ఆళ్లగడ్డ పట్టణంలో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథులు


సంజామల: గణనాథుల ముందు నృత్యం చేస్తున్న యువత


బనగానుపల్లెలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా అల్పాహారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సభ్యులు

నల్లబ్యాడ్జీలతో నిరసన

అవుకు, సెప్టెంబరు 11 : జీవో 85ను రద్దు చేయాలని మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు వినోద్‌కుమార్, యమున, నవీన్ డిమాండ్ చేశారు. బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ విధుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ జీవో 85తో తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద ఈనెల 16న నిరసనకు దిగుతామని తెలిపారు.

వినాయక లడ్డూ వేలాల్లో పోటీ

డోన్, సెప్టెంబరు 11: డోన్ పట్టణంలో ఆయా వినాయక మండపాల వద్ద వినాయక లడ్డూల వేలం పాటలో భక్తులు పోటీపోటీగా పాల్గొన్నారు. అర్జున్ రెడ్డి కాలనీలో లడ్డూను రమేష్ రెడ్డి రూ.70వేలకు , శ్రీరా ముల దేవాలయంలో ఎంఎస్ఆర్ కార్యాలయం తరుపున పార్థరెడ్డి రూ.36వేలకు, తారకరామనగర్ 26వ వార్డులో లడ్డూను బత్తిన మునిస్వామి రూ.23వేలకు దక్కించుకున్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

కొలిమిగుండ్ల, ఆగస్టు 11 : అవుకు రిజర్వాయర్ నుంచి కడప జిల్లా ప్రాజెక్టులకు నీటి విడుదల కొనసాగు తోంది. గాలేరు-నగరి సుజలస్రవంతి కాలువ ద్వారా కృష్ణా జలాలు కడపకు జిల్లా ప్రాజెక్టుల వైపు పరుగులు తీస్తున్నాయి. పైనుంచి వరద నీరు ప్రాజెక్టులకు చేరుతుండడంతో నీటి విడుదలను మరింత పెంచినట్లు నీటి పారుదల శాఖ అధికారులు వెల్లడించారు.

జిల్లా అభివృద్ధే ధ్యేయం: మంత్రి బీసీ


ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె , సెప్టెంబరు 11: జిల్లాలో సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి శాయశక్తులా కృషి చేసి, జిల్లాను అన్ని రంగాల్లో నంబర్‌వన్ చేయడమే ధ్యేయమని రాష్ట్ర ఆర్ అండ్‌బీ శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రి బీసీకి వినతిపత్రాలు అందజేశారు. చాలా సమస్యలు అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ బిల్డింగుల డేటా ఎంట్రీ పూర్తి చేయాలి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 11 : తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరైన ఎన్టీఆర్ బిల్డింగులకు సంబంధించి డేటా ఎంట్రీ తయారు చేసి త్వరగా పంపించాలని నంద్యాల, డోన్ హౌసింగ్ ఈఈలు హరిగోపాల్, క్రిష్టారెడ్డి తెలిపారు. బుధవారం నంద్యాల నుంచి కొలిమిగుండ్ల వెళ్తూ మార్గమధ్యంలోని కోవెలకుంట్ల హౌసింగ్ కార్యాలాయాన్ని వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన ఎన్టీఆర్ బిల్డింగులు పూర్తయినప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు మంజూరు చేయకుండా జాప్యం చేశారన్నారు. త్వరలోనే ఈ బిల్డింగులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేస్తామన్నారు. అలాగే ఉపాధి కూలీల పనిదినాలకు సంబంధించి బిల్లులపై ఆరా తీశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మద్దిలేటి, వర్క్ ఇన్స్‌పెక్టర్లు గోవిందు, సుబ్బరాయుడు, కంప్యూటరు ఆపరేటరు గంగాధర్ పాల్గొన్నారు.

అభివృద్ధి నిధులపై చర్చ

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 11: మండలంలోని ఆయా ప్రాథమిక వైద్యశాలలకు నిధులు మంజూరు అయినట్లు ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ తెలిపారు. బుధవారం పెద్దయ్మ నూరు గ్రామ ప్రాథమిక వైద్యశాలలో అభివృద్ధి నిధుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి విజయదుర్గ మాట్లాడుతూ తమ పీహెచ్‌సీకి మొదటి విడుతగా రూ. 87 వేలు నిధులు మంజూరు అయ్యాయరన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఉమ మహేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈవో మునిస్వామి ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, సెప్టెంబరు 11: గ్రామాల్లో సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ టి.సుల్తాన సూచించారు. బుధవారం మండలంలోని శెట్టివీడు గ్రామంలో ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది వెంకటేశ్వర్లు, సుబ్బరా యుడు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

చాగలమర్రి, సెప్టెంబరు 11: ఉపాధిహామీకి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఏపీవో నిర్మల సూచించారు. బుధవారం ఉపాధిహామీ కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. సామాజిక విచారణలో భాగంగా ఉపాధి సిబ్బంది చేసిన పనులను రికార్డుల్లో నమోదు చేయాలని అన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

చాగలమర్రి, సెప్టెంబరు 11: విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలని ఎంఈవో అనురాధ సూచించారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని పాతబస్టాండువీధి లోగల ప్రాథమిక పాఠశాలను ఎంఈవో తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల కోసం వడ్డిన భోజనాన్ని పరిశీలించారు. ఆమె వెంట హెచ్‌ఎం మౌలాలి, ఉపాధ్యా యులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

బనగానపల్లె , సెప్టెంబరు 11: ప్రతి ఒక్కరు పర్యావ రణ పరిరక్షణ బాధ్యతగా స్వీకరించి కృషి చేయాలని జేకే ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. బుధవారం మండలంలోని చెర్వుపల్లె ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు వీరబ్రహ్మేంద్ర భక్తమండలి సహకారంతో రాతపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నౌషదాబేగం, పాఠశాల కమిటీ చైర్మన్ ఆశాబేగం, మహమ్మద్‌హుసేన్, మహేంద్ర, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 11: అహోబిలంలో జరిగిన నిమ జ్జనం కార్యక్రమంలో ప్రమాదవశాత్తు తెలుగుగంగ కాలు వలో పడి మృతి చెందిన బాలుడు లాల్‌బాషా తల్లిదండ్రులకు గణేష్ ఉత్సవకమిటీ సభ్యులు బుధవారం రూ. 30వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో రాంభూపాల్, శ్రీనివాసులు, రామాంజనేయులు, నాగేంద్ర, నవీన్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 11: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ సూచించారు. పోషణ మాసోత్సవంలో భాగంగా బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలోని పాలసాగరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం, రక్తహీనత, పరిశుభ్రత, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

డోన్‌లో ట్రాఫిక్ సమస్య

- పట్టణ నడిబొడ్డులో రైల్వేగేట్లు
- అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

డోన్(రూరల్), సెప్టెంబరు 11: డోన్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. పట్టణ నడిబొడ్డులో రెండు రైల్వేగేట్లు ఉండటంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. పట్టణంలో 80వేలకు పైగా జనాభా ఉంది. ద్విచక్ర వాహనాల వాడకం పట్టణంలో అధికంగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతూ వస్తోంది. పట్టణ నడిబొడ్డులోని కర్నూలు, నంద్యాల రైల్వేగేట్లు ఉండటం, ఆ గేట్ల మీదుగా డబుల్ లైన్ ట్రాక్‌లు కావడంతో గూడ్స్, ఇతర రైళ్ల రాకపోకలు పెరిగాయి. దీంతో నిత్యం అరగంటకు ఒకసారి రైల్వేగేట్లు మూసేయడంతో వాహనదారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణ నడిబొడ్డు మీదుగా పొడవైన ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసినప్పటికీ బస్సులు, లారీల, పెద్ద వాహనాలకు అనుకూలంగా ఉంది. ద్విచక్రవాహనదారులు పట్టణం నడిబొడ్డులోకి రావాలన్నా.. ఏర్పాటు చేసిన ఫ్లైఓవర్ బ్రిడ్జి ఇప్పుడు దూరం కావడంతో రైల్వేగేట్ల మీదుగానే అధికంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యగా మారింది. రైల్వేగేట్ల వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


రైల్వేగేట్లు వేయడంతో అవస్థపడుతున్న వాహనదారులు

రైల్వే అండర్ బ్రిడ్జిని నిర్మించాలి



పట్టణ నడిబొడ్డులో ఉన్న రెండు రైల్వేగేట్ల వద్ద అరగంటకు ఒకసారి వేసే రైల్వే గేట్ల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్రవాహనాలు వెళ్లే విధంగా అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

- ఏఈ నాగరాజు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు, డోన్

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి

పట్టణంలో ట్రాఫిక్ సమస్యను మూడు నెలల్లో పరిష్కరిస్తాం. ట్రాఫిక్ సమస్య అధికంగా బేతంచెర్ల సర్కిల్ రోడ్డులో, పాతబస్టాండు ప్రధాన రోడ్డులో ఉన్నది. ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. ఆ దిశగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

- పి.శ్రీనివాసులు, డోన్ డీఎస్పీ